సాక్షి
పల్నాడు
శనివారం । 13 । ఏప్రిల్ । 2024



ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు 14వ స్థానం

- జూనియర్ ఇంటర్లో 65 శాతం ఉత్తీర్ణత
- సీనియర్ ఇంటర్లో 73 శాతం ఉత్తీర్ణత

నరసరావుపేటఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా 73 శాతంతో రాష్ట్రంలో 14వ స్థానంలో నిలిచింది. 132 కళాశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో జూనియర్ ఇంటర్ పరీక్షకు 13,651 మంది హాజరు కాగా 8,874 మంది ఉత్తీర్ణులయ్యారు. పాస్ పర్సంటేజ్ 65 శాతంగా ఉంది. సీనియర్ ఇంటర్ పరీక్షకు 12,087 మంది హాజరు కాగా 8,870 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 73 శాతంగా ఉంది. అలాగే ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం 721 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 367 మంది, ద్వితీయ సంవత్సరం 520 మంది విద్యార్థులకు గాను 309 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

మహా జనసముద్రం





ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థులు విడదల రజిని, మేకతోటి సుచరిత, అన్నాబత్తుని శివకుమార్, అంబటి మురళీకృష్ణ, నూరిఫాతిమా, ఎం.లావణ్య, బలసాని కిరణ్‌కుమార్

- సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం యాత్రకు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో బ్రహ్మరథం
- గుంటూరులో బహిరంగ సభకు పోటెత్తిన జనసందోహం
- వర్షం కురిసినా లెక్కచేయని అభిమాన జనం
- ధూళిపాళ్ల నుంచి మొదలై నంబూరు వద్ద ముగిసిన బస్సు యాత్ర

సాక్షి, నరసరావుపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా 13వ రోజు శుక్రవారం పల్నాడులో ముగించుకొని గుంటూరు జిల్లాలోకి ప్రవేశించింది. నగర శివారు ఏటుకూరు బైపాస్‌లో సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభకు పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు హాజరయ్యారు. సభకు ముందు పెద్ద వర్షం కురిసినా పార్టీ శ్రేణులు, ప్రజలు సభకు తరలివచ్చారు. జగనన్న ప్రసంగానికి సభికుల నుంచి విశేష స్పందన వచ్చింది. జిల్లాలో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేసి వారిని ఆశీర్వదించమని, గెలిపించమని ప్రజలను కోరారు.

సత్తెనపల్లిలో ఘనస్వాగతం

పల్నాడు జిల్లా బస కేంద్రం ధూళిపాళ్ల నుంచి ఉదయం 10.15 గంటలకు యాత్ర మొదలైంది. అక్కడి వేచి ఉన్న వందలాది మంది అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. భాగ్యనగర్‌కాలనీ, కంకణాలపల్లి అడ్డరోడ్డు, వెన్నాదేవి సెంటర్ల మీదుగా చెక్‌పోస్టు వద్దకు బస్సు చేరుకుంది. తమిళనాడు నుంచి 1980 ప్రాంతంలో వచ్చిన వలసకూలీలు జగన్ పాలన చాలా బాగుందని చెప్పారు. యాత్ర సత్తెనపల్లిలోని చెక్‌పోస్టు సెంటర్ వద్దకు చేరగానే అప్పటికే ఏర్పాటు చేసిన క్రేన్లతో భారీ గజమాలలు రెండువైపులా తోరణంలా ఉంచి వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం పలికారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చి, డీజే మోతలతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. చెక్‌పోస్టు వద్ద బస్సు టాప్‌పైకి ఎక్కి సీఎం అభివాదం చేశారు. పట్టణంలో న్యాయవాదులు, విద్యాదీవెన, వసతి దీవెన పొందుతున్న విద్యార్థులు, పింఛన్ లబ్ధిదారులు జననేతను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఆటోనగర్ వద్దకు కొమెరపూడి వద్ద నుంచి వచ్చిన ఆగేసమ్మ(66) పింఛన్ పంపిణీ గత ప్రభుత్వంలో ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా ఉందో చెబుతూ తమ ఓటు జగన్‌బాబుకే అని గట్టిగా అరుస్తూ చెప్పడం పలువురిని ఆకట్టుకుంది.

గుంటూరు పులకించింది
ఆకాశం నుంచి వరుణుడు ఆశీర్వదించగా..
పండువెన్నెల జల్లులు అక్షింతలుగా..
అభిమానం 'తడిసి'ముద్దయింది
సంక్షేమ సారథి జగన్ రాక ఓ వేడుకైంది
ప్రతి అడుగు సంక్షేమం వైపు
ప్రతి మాట అభివృద్ధి తూట
ప్రతి వాగ్దానం శిఖర సమానం
ప్రతి చిరునవ్వు జనహృదయాలను హత్తుకుంది
ప్రతి దరహాసంలో ప్రజాకాంక్షే..
మహోజ్వల జనాకాంక్షే వైఎస్ జగన్
బాటగా బస్సు యాత్ర సాగింది.

అన్న మళ్లీ నీవే వస్తావ్..

బస్సుయాత్ర గుంటూరు జిల్లా మేడికొండూరు మండలంలోకి చేరుకోగానే జిల్లా నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ప్రతి పల్లెలో భారీ గజమాలతో జననేతకు స్వాగతం పలికారు. ఎక్కడికక్కడ భారీగా అభిమానులు రోడ్డుపైకి రావడంతో యాత్ర అనుకున్న సమయం కన్నా ఆలస్యంగా నడిచింది. సత్తెనపల్లి– గుంటూరు రహదారి వెంబడి ఉన్న అడ్డరోడ్ల మీదకు సమీపంలోని గ్రామాల నుంచి పెద్దఎత్తున రైతులు, రైతు కూలీలు వచ్చి తమ అభిమాన నేతకు సాదరస్వాగతం పలికారు.

భోజన విరామం లేకుండా యాత్ర ...

మేమంతా సిద్ధం బస్సు యాత్రకు అడుగడుగునా అపూర్వ స్పందన వస్తుండటంతో అనుకున్న షెడ్యూల్ కన్నా సుమారు మూడు గంటలు ఆలస్యంగా సాగింది. పేరేచర్లకు యాత్ర 4 గంటలకు చేరుకోగా అక్కడి నుంచి నల్లపాడులో కాలేజీ సెంటర్‌కు చేరుకోవడానికి గంట సమయం పట్టింది. చల్లావారిపాలెం మీదుగా హౌసింగ్ బోర్డుకాలనీలో భోజన విరామం కోసం ఏర్పాటు చేసిన బస వద్దకు సాయంత్రం 5.50 గంటలకు చేరుకున్నారు. దీంతో భోజన విరామం తీసుకోకుండా యాత్ర కొనసాగించారు. చుట్టుగుంట సర్కిల్ మీదుగా ఏటుకూరు బైపాస్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభకు సీఎం చేరుకున్నారు. చుట్టుగుంట సర్కిల్‌లో భారీ క్రేన్లతో ఏర్పాటు చేసిన మిర్చి దండ చూపరులను ఆకట్టుకుంది. సుమారు 17 కిలోమీటర్ల మేర గుంటూరు నగర పరిసరాల్లో జరిగిన యాత్ర జనసంద్రంగా మారింది. జగన్నినాదంతో మారుమోగింది. దారికి ఇరువైపులా బారులు తీరి సంఘీభావం తెలిపారు.



హాయ్ మామ..చిన్నారి ఆనందం



పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మేమంతా సిద్ధం రోడ్ షోకు భారీగా తరలివచ్చిన జనసందోహంలో ఓ భాగం



సెల్ఫీ ఫ్లీజ్... జగన్‌తో సెల్ఫీ దిగుతున్న మహిళ



బిడ్డ బాగున్నావా... వైఎస్ జగన్‌తో వృద్ధురాలు



భారీ గజమాలతో సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం



ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్, బస్సుపై మంత్రి రజిని, కిలారి

అభాగ్యులకు అండగా నిలుస్తూ...

మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా సమస్యలు చెప్పడానికి వచ్చిన వారిని వైఎస్ జగన్ అక్కున చేర్చుకున్నారు. వారికి భరోసా కల్పించి, సహాయానికి తక్షణ ఆదేశాలు జారీ చేశారు. క్రోసూరు మండలం ఊటుకూరుకి చెందిన షేక్ మాబు సుభాని రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో వైద్యం కోసం రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరగా వారికి సమగ్ర వివరాలు తీసుకొని సమస్యలు పరిష్కారిస్తామని భరోసా ఇచ్చారు. వేజెండ్ల మండలం కొర్రపాడుకు చెందిన ముత్తు బాలస్వామి తనకు క్యాన్సర్ రావడంతో బతకడం కష్టమని డాక్టర్లు చెప్పారని, కానీ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.6 లక్షల విలువైన వైద్యం ప్రభుత్వం ఉచితంగా అందించి ప్రాణాలతో ఉన్నానని కృతజ్ఞతలు తెలిపారు.

నంబూరు వద్ద రాత్రి బస

మేమంతా సిద్ధం బహిరంగ సభ అనంతరం సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర తిరిగి ప్రారంభించి తక్కెళ్లపాడు బైపాస్, పెదకాకాని బైపాస్, వెంగళరావునగర్, నంబూరు క్రాస్‌ల మీదుగా యాత్ర సాగింది. తన కోసం వేచి ఉన్న అభిమానులకు అభివాదం చేస్తూ యాత్ర ముందుకు సాగింది. నంబూరు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన రాత్రి బస కేంద్రం వద్దకు రాత్రి 8.15 గంటలకు చేరుకోవడంతో మేమంతా సిద్ధం సభ 13 రోజు యాత్ర విజయవంతంగా ముగిసింది.

క్లుప్తంగా

టోఫెల్ పరీక్షతో విదేశీభాషపై అవగాహన


జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు



విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

నరసరావుపేట రూరల్: విద్యార్థుల్లో విదేశీ భాషపై అవగాహన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు టోఫెల్ దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు వైఎస్ఆర్ అండ్ వైవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహిస్తున్న టోఫెల్ పరీక్షను ఆయన పరిశీలించారు. ఐఎఫ్‌బీ బోర్డ్స్ ద్వారా జరుగుతున్న టోఫెల్ పరీక్షల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులతో కలిసి భోజనాన్ని స్వీకరించారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందజేయాలని, మెనూను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఐఎఫ్‌బీ కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు, ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ ఏపీ మధుకుమార్, ఉపాధ్యాయులు డి.వీరారెడ్డి, నాగప్రసాద్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో 510 అడుగుల నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 510.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 5,292, ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 809.60 అడుగుల వద్ద ఉంది.

జగనన్న హయాంలోనే నాదెండ్ల వాసులకు రెట్టింపు సంక్షేమం

- వైఎస్సార్‌సీపీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్
- పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడుతో కలిసి నియోజకవర్గంలో పర్యటన



ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి పి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌నాయుడు

నాదెండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాదెండ్ల మండలంలో ప్రజలకు రెట్టింపు సంక్షేమం అందడంతో పాటు భారీ ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని పార్టీ ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. చిలకలూరిపేట పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో నాదెండ్ల మండలంలోని ఐదు గ్రామాల్లో వారు పర్యటించారు. ముందుగా సాతులూరు గ్రామంలో గద్దె కోటేశ్వరరావు, ఉడత వెంకటేశ్వరావు, మాజీ ఎంపీటీసీ గొర్రె శివ, తూబాడులో మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి నివాసంలోనూ, చిరుమామిళ్లలో సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి నివాసంలో కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. తమ పార్టీ మరోమారు అధికారం చేపట్టేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. చందవరం గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద నాయకులు, గ్రామస్తులు శాలువాలతో అనిల్‌కుమార్ యాదవ్, కావటి మనోహర్ నాయుడుకు స్వాగతం పలికారు.

రెండు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

మండలంలోని జంగాలపల్లి, సంకురాత్రిపాడు గ్రామాల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార వాహనంపై ఆయా గ్రామాల నాయకులతో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మండలం పరిధిలో ఇచ్చిన హామీల మించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రెట్టింపు సంక్షేమ, అభివృద్ధి పనులు జరిగాయన్నారు. టీడీపీ పాలనలో దోచుకోవడం.. దాచుకోవడమే తప్ప అభివృద్ధి ఆనవాళ్లు ఏమీ లేవన్నారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని ఆకాంక్షించే వైఎస్సార్ సీపీ గెలవడం ఖాయమన్నారు. ప్రజలు తమకు మద్దతునిచ్చి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణి, యార్డ్ చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ అల్లడి రవి కుమార్, సర్పంచులు గోళ్లమూడి కాశియ్య, జెట్టి నాగమణి శివలక్ష్మీనారాయణ, సింగారెడ్డి లక్ష్మి, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, నాయకులు గద్దె ఆంజనేయులు, దాట్ల విక్రమరాజు, టీజే రత్తయ్య, సుందరరెడ్డి, చిన్నపరెడ్డి, తిరుమలరెడ్డి లూర్దురెడ్డి, ఏసురత్నం, శిలువరెడ్డి, మేకల రామిరెడ్డి, ఆంజనేయరెడ్డి, బ్రహ్మారెడ్డి, నారసాని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హీరోకు ఏమాత్రం తీసిపోదు మన రజినమ్మ

- లావణ్యమ్మ తలపడుతోంది ఎవరితోనో తెలుసా..?
- బహిరంగ సభలో అభ్యర్థులను ప్రకటించిన సీఎం వై.ఎస్.జగన్

పట్నంబజారు/ లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మన రజినమ్మ హీరోకు ఏ మాత్రం తీసిపోదని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం సాయంత్రం మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా ఏటుకూరు బైపాస్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేశారు.

- ఎంపీ అభ్యర్థిగా రోశయ్య అన్న నిలబడబోతున్నాడు. మీ అందరికీ కూడా తెలిసిన వాడే. రోశయ్య అన్న మంచివాడు, సౌమ్యుడు, మీ అందరి చల్లని దీవెనలు అన్నపై ఉండాలని సవినయంగా కోరుతున్నాను.
- గుంటూరు ఈస్ట్ నుంచి నా చెల్లెలు.. ఫాతిమా నిలబడుతోంది. యువకురాలు, ఉత్సాహవంతురాలు, మంచి చేయడానికి ముందుకు వస్తోంది. మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు నా చెల్లిపై ఉంచవలసిందిగా సవినయంగా కోరుతున్నాను.
- ప్రత్తిపాడు నుంచి కిరణ్ నిలబడుతున్నాడు. నా తమ్ముడు, యువకుడు, ఉత్సాహవంతుడు, మంచి చేయడానికి ముందుకొచ్చాడు. మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు కిరణ్‌పై ఉంచాలని కోరుతున్నాను.
- మంగళగిరి నుంచి మీ బిడ్డ, నా చెల్లెలు.. ఎవరితో తలపడుతోందో తెలుసా? మీ బిడ్డకు, మీ లోకల్‌కు, మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు అవసరం. ఎందుకంటే ఒక మెసేజ్ పంపించాలి. ఒక ఎమ్మెల్యే అంటే ఈ మాదిరిగా ఉండాలి, అందుబాటులో ఉండే పరిస్థితి కచ్చితంగా ఉండాలి అని చెప్పే మంచి చెల్లెమ్మ లావణ్యమ్మ. సంపూర్ణంగా గొప్ప మెజారిటీతో గెలిపించమని చెప్పి ప్రార్థిస్తున్నాను.
- తాడికొండ నుంచి నా చెల్లెలు సుచరితమ్మ నిలబడుతోంది. నా చెల్లి గురించి నేను వేరే చెప్పాల్సిన పని లేదు. ఆశీర్వదించండి. మంచి చేస్తుంది. మీ అందరికీ ఎప్పుడూ అందుబాటులో ఉండి తోడుగా ఉంటుంది నా చెల్లి.
- గుంటూరు వెస్ట్ నుంచి నా మరో చెల్లి రజిని నిలబడుతోంది. స్థానికురాలు, మగవాళ్లకు హీరో అన్న పదం చెబుతారు కానీ, ఏ మాత్రం తగ్గదు. మంచి చేస్తుంది. మంచి కోసం నిలబడుతుంది. మీలో ఒకరు. ఆశీర్వదించమని కోరుతున్నాను.
- తెనాలి నుంచి శివ నిలబడుతున్నాడు. మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు శివపై ఉంచవలసిందిగా కోరుతున్నా. శివ నాకు మంచి స్నేహితుడు కూడా.
- పొన్నూరు నుంచి మురళీ అన్న నిలబడుతున్నాడు. యువకుడు, ఉత్సాహవంతుడు, మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు మురళీ అన్నపై ఉంచవలసిందిగా ప్రార్థిస్తున్నాను. మంచి చేయడానికి వీళ్లందరూ కూడా ముందుకు వచ్చారు. మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు వీళ్లపై మెండుగా ఉంచవలసిందిగా కోరుతున్నాను.

సభలో ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుసెంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), షేక్ మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పార్టీ నేతలు మోదుగుల వేణుగోపాలరెడ్డి, దాసరి కిరణ్, రావెల కిషోర్‌బాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కాండ్రు కమల, గంజి చిరంజీవి, రాతంశెట్టి రామాంజనేయులు (లాలుపురం రాము) పాల్గొన్నారు.

గుంటూరు ఆర్టీఏకు రూ.259.78 కోట్ల ఆదాయం



పట్నంబజారు: గుంటూరు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(ఆర్టీఏ) ద్వారా 2023, 2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.259.78 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందని రవాణా శాఖ డీటీసీ షేక్ కరీమ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యం రూ. 403.59 కోట్లు కాగా రూ. 259.78 కోట్లు (64.37 శాతం) సాధించడం జరిగిందని తెలిపారు. త్రైమాసిక పన్నుల ద్వారా రూ. 49.55 కోట్లు, జీవిత కాలం పన్ను ద్వారా రూ. 177.42 కోట్లు, ఫీజుల ద్వారా రూ. 16.54 కోట్లు, సర్వీసు చార్జిల ద్వారా రూ. 4.17 కోట్లు, వాహనాల తనిఖీల రూపంలో 12.10 కోట్లు, కలిపి మొత్తం రూ. 159.78 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి సమకూరినట్లు తెలిపారు.

మీరే ముఖ్యమంత్రిగా కొనసాగాలి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

ముప్పాళ్ళ: తప్పకుండా మీరే గెలుస్తారు...అదే మాకు చాలంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెప్పామని ముప్పాళ్ళ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన బొబ్బా వెంకటేశ్వరరెడ్డి అనే వృద్ధుడు చెప్పారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా దూళిపాళ్ళ నుంచి సత్తెనపల్లి వెళుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసేందుకు మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ అభిమానులు వెన్నాదేవి సమీపంలో వేచి ఉండటాన్ని గమనించారు. బస్సును ఆపి వారందరినీ ఆప్యాయంగా పలకరించి ఏం కావాలని అడగ్గా, మీరు ముఖ్యమంత్రి అయితే చాలని చెప్పామని గ్రామస్తులు రాప్రోలు ఉషారాణి, బోడా కృష్ణవేణి, ఇందూరి శివారెడ్డిలు తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి ఆవులవారిపాలెం టీడీపీ కార్యకర్తలు



ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

ఆవులవారిపాలెం (క్రోసూరు): మండల పరిధిలోని ఆవులవారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో దొడ్లేరు పార్టీ ఆఫీసులో కండువా కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో తిరుమల పగిడిరాజు, గోపు మాధవ్, గోపురాజు, గోపు శీను, గోపి బాజీ, గోపు గురుస్వామి, గోపు జగన్నాథం, వల్లాల దుర్గారావు, గణేష్, చిన్న గురవయ్య, నల్లబోతుల వేణు, మాదాసు చిన్న పిచ్చయ్య, పెద్ద పిచ్చయ్య, కుందుల రవీంద్ర, తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు శివారు గ్రామం అద్దంకి బ్రాంచ్ కెనాల్‌ను ఎన్నెస్పీ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఈఈ రేపూడి మల్లిఖార్జున రావు మాట్లాడుతూ అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాలు విడుదల చేశామన్నారు. ఈనెల 15 వరకు ఏబీసీ కెనాల్ పరిధిలో అన్నీ మేజరు కాల్వలను మూసివేసి ప్రకాశం జిల్లా వరకు సాగర్ జలాలు విడుదల చేస్తామన్నారు. అలాగే ఈనెల 16వ తేదీ నుంచి అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో మంచినీటి చెరువులన్నీ పూర్తిస్థాయిలో నింపేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు. ఈనెల 22 వరకు సాగర్ జలాలు విడుదల అవుతాయని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్నెస్పీ అధికారులు పర్యవేక్షణలో నూరు శాతం మంచినీటి చెరువులు వాగులు కుంటల తదితరవన్నీ నింపాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా అధికారులు బాధ్యత వహించాలన్నారు. అక్రమ మార్గంలో సాగర్ జలాలను వినియోగిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఇందుకుగాను నరసరావుపేట డీఎస్పీ వత్సవాయి సత్యనారాయణ వర్మతో ఫోనులో మాట్లాడి సహకారం అందించాలని కోరారు. తాగునీటి అవసరాల కోసం మాత్రమే సాగర్ జలాలు విడుదల చేశామని ఇతర అవసరాలకు వినియోగించరాదన్నారు. అనంతరం 13వ మైలురాయి వద్ద సాగర్ జలాలు సామర్థ్యం పరిశీలించారు. ఆయనతో పాటు ఏఈ పోట్లూరి లక్ష్మీ నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్, ఎన్నెస్పీ అధికారులు నందకిషోరు తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు

- జిల్లా ఆర్డీవో రవీందర్
- అలసత్వం వహించిన ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు



చెరుకూరులో మంచి నీటి చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో రవీందర్

పర్చూరు (చినగంజాం): ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని బాపట్ల ఆర్డీవో జీ రవీందర్ ఆదేశించారు. పర్చూరు మండలంలో గతంలో చోటు చేసుకున్న నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని ఆయన శుక్రవారం మండలంలోని పలు చెరువులు, ట్యాంకులను పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ సుబ్బయ్యతో కలిసి మండలంలోని చెరుకూరు, రమణాయపాలెం, పోతుకట్ల, వీరన్నపాలెం గ్రామాల్లోని మంచి నీటి చెరువులను పరిశీలించారు. వేసవి నేపథ్యంలో ఆయన చెరువులను పర్యవేక్షించారు. చెరువులకు నీటిని నింపే క్రమపద్ధతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని ఫిల్టర్ బెడ్స్ సక్రమంగా పని చేస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. రమణాయపాలెం గ్రామంలో నీరు వృథాగా పోవటాన్ని ఆర్డీవో గమనించి అధికారులను నిలదీశారు. విధి నిర్వాహణలో అలసత్వం వహించిన గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆర్డీఓ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చెరుకూరు గ్రామ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జైత్రయాత్రలా బస్సు యాత్ర

గుంటూరురూరల్: జైత్రయాత్రలా బస్సుయాత్ర సాగుతుందని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. శుక్రవారం ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన మేమంతా సిద్ధం సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రత్యేకమైన చరిత్ర కలిగిన గుంటూరు జిల్లాలో సీఎం సభ జరుగుతుందని, జోరున వర్షం కురుస్తున్నా.. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎత్తిన పార్టీ జెండా దించకుండా, వర్షంలో తడుస్తూ జగన్‌మోహన్‌రెడ్డికి జయజయధ్వానాలు పలుకుతున్న తీరు రాష్ట్రం యావత్ చూస్తుందన్నారు. రాష్ట్రంలో 175 కి 175 అసెంబ్లీ స్థానాలు, 25 కి 25 పార్లమెంట్ స్థానాలు గెలిపించడం కోసం పార్టీ శ్రేణులతోపాటు ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే ప్రజాస్వామ్యవాదులంతా వైఎస్ జగన్‌కు జేజేలు పలుకుతున్నారని గర్వంగా చెబుతున్నానన్నారు.

ప్రత్తిపాడును కానుకగా ఇచ్చేందుకు మేమంతా సిద్ధం

ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రత్తిపాడు నుంచి పోటీ చేసే గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. మేమంతా సిద్ధం సభలో ఆయన మాట్లాడుతూ నన్ను నమ్మి దళితుడినైన నాకు గొప్ప అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రత్తిపాడు సీటును బహుమతిగా మీకు అందిస్తామని, అందుకు మేమంతా సిద్ధంగా ఉన్నామన్నారు.

జగన్‌ను చూడటానికి జ్వరం అడ్డం కాదు

శరీరం సహకరించకున్నా తరలివచ్చిన వృద్ధుడు



మన్నం కోటేశ్వరరావు

పెదకూరపాడు, అమరావతి: కడుపున పుట్టిన బిడ్డలే బువ్వ పెట్టని రోజులు ఇవి.. ప్రతినెలా తలుపు తట్టి డబ్బులు ఇచ్చి కడుపు నింపే మా బిడ్డ వస్తే ఎంత జ్వరమైనా నాకు లెక్క లేదు. ఎంత ఎండైనా ఫర్వాలేదు.. మా బిడ్డను చూడాలి.. ఆశీర్వదించాలి అనుకుని పరుగు పరుగున ముఖ్యమంత్రిని చూసేందుకు తరలివచ్చాడు. సత్తెనపల్లి కొమెరపూడి గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధుడు మన్నం కోటేశ్వరరావు మండుటెండలను సైతం లెక్క చేయకుండా జ్వరంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు తరలివచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నూరేళ్లు వరిల్లు బిడ్డా అంటూ ఆశీర్వదించారు.

మా పెదోళ్ల నాయకుడు వచ్చాడు



షేక్ జానీబి, సత్తెనపల్లి

మా పెదోళ్ల నాయకుడు వచ్చాడు పని గినీ జాన్‌తానై... అంటూ సత్తెనపల్లికి చెందిన షేక్ జానీబి రోజు వారీ కూలీ మానుకోని జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు తరలి వచ్చారు. జగనన్న పాటకు మండెటెండల్లో నృత్యాలు చేసి అలరించారు. నాకు, నాకుటుంబానికి మేలు చేసి ఆదుకున్న జగన్‌మోహన్ రెడ్డిని చూసి మురిసిపోయానన్నారు. పేదోళ్లను చల్లగా చూసే నేత జగనన్న అంటూ కొనియాడారు.

మొదటి విడత ఈవీఎం ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్



రేండమనైజేషన్ ప్రక్రియలో కలెక్టర్, జేసీ, డీఆర్వో

నరసరావుపేట: మొదటి విడత ఈవీఎం రేండమనైజేషన్ ప్రక్రియ నిర్దేశిత వెబ్‌సైట్లో పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్ అన్నారు. శుక్రవారం ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఈఎంఎస్-2 నిర్దేశిత వెబ్‌సైట్ ప్రక్రియ మొదటి విడత ఈవీఎం రెండమనైజేషన్ ప్రక్రియ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పకడ్బందీగా ఈవీఎంలు, వీవీప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా ఏప్రిల్ 12వ తేదీన ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు ఈవీఎంలు, వీవీప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టాలని ఆదేశించిందని, దీనికోసం సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డీఇవో లాగిన్ నుంచి ఆన్‌లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో ఈవీఎంలు, వీవీప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్ చేపట్టామన్నారు. ముందుగా పార్లమెంటరీ నియోజకవర్గ స్థానానికి సంబంధించిన ఈవీఎంలు, వీవీప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్ చేపట్టామని, అనంతరం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు, వీవీప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్ చేపట్టి పూర్తి చేశామన్నారు. ఈవీఎం, వీవీప్యాట్స్ యంత్రాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందని, సెక్యూరిటీ ప్రోటోకాల్ ప్రకారం పటిష్ట పోలీస్ బందోబస్తుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎం, వీవీప్యాట్స్ యంత్రాలను పంపిస్తామన్నారు. మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్, ఎ.శ్యాంప్రసాదు, డీఆర్ఓ కె.వినాయకం, ఈవీఎంల నోడల్ అధికారి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

త్వరలో ప్రతివార్డులో సిద్ధం కార్యక్రమాలు

- గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- మేమంతా సిద్ధం గ్రాండ్ సక్సెస్

పిడుగురాళ్ల: నియోజకవర్గంలోని ప్రతివార్డులో మేము కూడా సిద్ధం కార్యక్రమాలను మరో వారం రోజుల్లో నిర్వహించటం జరుగుతుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వెల్లడించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం సభ గ్రాండ్ సక్సెస్ అయిందని, దానిని చూసి ఓర్వలేక తెలుగు దేశం పార్టీ నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. మేమంతా సిద్ధం సభ పల్నాడు ప్రాంతంలో ఒక చరిత్ర సృష్టించిందని తెలిపారు. గురజాల నియోజక వర్గానికి చేసింది, చేయబోయేది చెబుతూ, రాష్ట్ర మానిఫెస్టో , గురజాల నియోజకవర్గ మానిఫెస్టో కానీ మేము కూడా సిద్ధం సభల ద్వారా ప్రజలకు వివరిస్తామని ఆయన తెలియజేశారు.

యరపతినేని శ్రీనివాసరావు ప్రతిసారి తప్పుగా మాట్లాడుతున్నాడని, 2019 జనవరిలో మెడికల్ కాలేజీ మంజూరైనట్లు నిరూపిస్తే ఎన్నికల తర్వాత కంటే ముందే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటామని గురజాల నియోజకవర్గ కాసు మహేష్‌రెడ్డి తెలియజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, బీజీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు కాలే మాణిక్యరావు, కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లు పిచ్చిరెడ్డి, దాదినబోయిన ఏడుకొండలు, చింతా సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.